1,947కే విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడం సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,947గా నిర్ణయించింది. ఈ నెల 5 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొంది.

లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ విక్రయ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.14.36 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 16 శాతం ఎగబాకి రూ.1,489 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

ఇంటింటా ఇన్నోవేటర్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంటింటా ఇన్నోవేటర్-2024కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించింది. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొంది. ఆవిష్కరణలను 9100678543 వాట్సప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

6న ఏఐపై వర్క్‌షాపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంపై విసృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిసి ఈ నెల 6న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు టీ హబ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విసృతంగా వాడుకలోకి వచ్చిన ఏఐ టూల్స్ తరహాలో పరిశ్రమల అవసరాల కోసం ఉత్పాదక (జనరేటివ్)ఏఐపై ఆవిష్కర్తలు, స్టార్టప్ నిర్వాహకులు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా అమెజాన్ వెబ్ సర్వీసు (ఎడబ్ల్యుఎస్) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ హబ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని టీ హబ్ ప్రతినిధి తెలిపారు.

4.5 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఒక్కరోజే భారీగా ఆవిరైన సంపద

రికార్డు గరిష్ఠాల నుంచి సూచీలు వెనుకకు • సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనం



ముంబై, ఆగస్టు 2: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా నమోదు కావడం అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లకు రుచించలేదు. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. ఆల్‌టైమ్ హైల్లో సూచీలు ఉండటంతోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భారీ నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా 5 రోజుల లాభాలకు తెరపడినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 885.60 పాయింట్లు లేదా 1.08 శాతం క్షీణించి 80,981.95 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 998.64 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 293.20 పాయింట్లు లేదా 1.17 శాతం పతనమై 24,717.70 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే గరిష్ఠంగా 324.05 పాయింట్లు నష్టపోయింది.

రంగాలవారీగా..

రియల్టీ షేర్లు అత్యధికంగా 3.56 శాతం నష్టపోయాయి. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం, కమోడిటీస్ 1.83 శాతం, టెక్నాలజీ 1.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.70 శాతం చొప్పున క్షీణించాయి. ఇక మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేక నష్టాలను మూటగట్టుకున్నాయి. జూలైలో పడిపోయిన వాహన విక్రయాలతో ఆటో కంపెనీల షేర్లు, ఇన్ఫోసిస్‌కు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసుల కలకలంతో ఐటీ సంస్థల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.58 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులను పరిశీలిస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఐరోపాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్ల పరిస్థితీ ఇలాగే ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నలా భావించే అమెరికాలో మరోమారు ఆర్థిక మాంద్యం ఛాయలు అలుముకుంటున్నాయా? అన్న అంచనాల నడుమ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఈ పరిణామం భారత్‌సహా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లను కుదిపేసినట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూలైలో ఐఎస్ఎం తయారీ సూచీ 46.6కు దిగజారింది. దీంతో మాంద్యం భయాలు మళ్లీ నెలకొన్నాయని అంటున్నారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ నష్టాలకు దారితీశాయని వారు చెప్తున్నారు.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో కరిగిపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,46,003.7 కోట్లు తగ్గి రూ.4,57,16,946.13 కోట్ల (5.46 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 1.08 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ 0.58 శాతం చొప్పున పడిపోయాయి. ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో కదలాడగా.. సమయం గడుస్తున్నకొద్దీ మరింత తీవ్రంగా నేలచూపులు చూశాయి.

మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహీంద్రా గ్రూపు పెట్టుబడులపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆనంద్ మహీంద్రా అంగీకరించారు.

అమెరికాను భారత్ అందుకోలేదు

- **నాల్గోవంతు తలసరి ఆదాయాన్ని చేరాలన్నా 75 ఏండ్లు పట్టొచ్చు**
- **ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశం అంటూ భారత్‌ను కీర్తిస్తున్న వేళ.. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఓ నివేదిక అందులో నిజమెంత? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారత్‌సహా 100కుపైగా దేశాలు.. అధిక ఆదాయ దేశాలుగా ఎదిగేందుకు ఎన్నో తీవ్ర అడ్డంకులను ఎదుర్కోవాల్సి రావచ్చని వరల్డ్ బ్యాంక్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే అమెరికా తలసరి ఆదాయంలో ఒక్క త్రైమాసికానికి సమానమైన ఆదాయాన్ని చేరాలన్నా.. భారత్‌కు దాదాపు 75 ఏండ్లు పట్టవచ్చని అంచనా వేసింది. ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ప్రపంచ అభివృద్ధి నివేదిక 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ పేరిట తెచ్చిన రిపోర్టులో అమెరికా తలసరి ఆదాయంలో నాల్గోవంతును చేరడానికి చైనా కైతే 10 ఏండ్లు పడుతుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఇండోనేషియాకు 70 ఏండ్లు పట్టవచ్చున్నది.

కటిక దారిద్ర్యం

గత ఏడాది చివరికల్లా భారత్‌సహా 108 దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించారు. ఒక్కోదాని వార్షిక జీడీపీ తలసరి ఆదాయం 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల మధ్య ఉన్నది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. అలాగే ఈ దేశాల్లో ప్రతీ ముగ్గురిలో ఇద్దరు కటిక దారిద్ర్యంలో మగ్గిపోతుండటం గమనార్హం. ఇదిలావుంటే 1990 నుంచి ఇప్పటిదాకా కేవలం 34 దేశాలే మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల నుంచి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థలకు ఎదిగాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త గిల్ తెలిపారు.

రికార్డుస్థాయికి ఐటీ రిటర్నులు

7.28 కోట్ల మంది దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 7.28 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. 2023-24 ఏడాది దాఖలు చేసిన 6.77 కోట్ల కంటే వీరి సంఖ్య 7.5 శాతం అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు జూలై 31 చివరి రోజు 70 లక్షల మంది దాఖలు చేసినట్లు తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన 7.28 కోట్ల మందిలో నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నవారు 5.27 కోట్ల మంది కాగా, పాత పన్నుల విధానాన్ని కొనసాగించిన వారు 2.01 కోట్ల మంది. పన్ను చెల్లింపుదారుల ప్రాధాన్యతలు అంతకంతకు పెరుగుతున్నాయి. . ఈసారి దాఖలు చేసిన వారిలో 72 శాతం మంది ఈ పన్ను విధానాన్ని ఎంచుకోగా, 28 శాతం మంది పాత పన్నుల విధానంలోనే దాఖలు చేశారు. అలాగే కొత్తగా దాఖలు చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. దాఖలు చేసిన వారిలో ఐటీఆర్-1 కింద 45.77 శాతం(3.34 కోట్లు), ఐటీఆర్-2 కింద 14.93 శాతం(1.09 కోట్లు), ఐటీఆర్-3 కింద 12.5 శాతం(91.10 లక్షలు), ఐటీఆర్-4 కింద 25.77 శాతం(1.88 కోట్లు), ఐటీఆర్-5 నుంచి ఐటీఆర్-7 కింద 1.03 శాతం(7.48లక్షలు) కేటగిరిల కింద దాఖలు చేశారు. వీరిలో 43.82 శాతం మంది ఆన్‌లైన్‌లో ఐటీఆర్ దాఖలు చేయగా, మిగతావారు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

పన్ను ఎగవేతలు కూడా..

పన్ను చెల్లింపుదారులు పెరిగినట్లే పన్ను ఎగవేతదారులు కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. గడిచిన పదేండ్లకాలంలో పన్ను ఎగవేతదారులు వెయ్యి రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.9.08 లక్షల కోట్ల పన్ను చెల్లింపులకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయి. 2013014 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.80 వేల కోట్లుగా ఉన్నది.

టార్గెట్ 'ఇన్ఫోసిస్' మూర్తి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కంపెనీ రూ. 32,403 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సంబంధించి కర్ణాటక స్టేట్ జీఎస్టీ అధికారులు ముందస్తు షోకాజ్ నోటీసులు పంపడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు వారంలో 70 గంటలు పనిచేయాలన్న నారాయణ మూర్తి కామెంట్లను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇన్ఫోసిస్ జరిమానా కట్టడానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎగవేతకు సంబంధించిన నోటీసులను వెనక్కి తీసుకొంటున్నట్టు జీఎస్టీ అధికారులు తాజాగా వెల్లడించడం గమనార్హం.

జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు!

అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): భూతాపం ఆధారంగా విద్యుదుత్పత్తికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరును జియోథర్మల్ క్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. అక్కడ 122 మోగావాట్ల జియోథర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ఏర్పాటు చేయడానికి శుక్రవారం సింగరేణి, ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్, రెడ్కో జీఎం సత్య వరప్రసాద్‌లు హాజరయ్యారు. ఇప్పటికే 20 కిలోవాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వగా, 122 మెగావాట్లకు వీలుందని ఓఎన్‌జీసీ నివేదిక వెల్లడించింది. మరికొన్ని పరిశోధనల్లో 3,500 మోగావాట్ల వరకు జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లుగా తేలింది.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి..

రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు.

పచ్చదనం పరిశుభ్రతను పాటించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఇంద్రవెల్లి, ఆగస్టు 2: గ్రామాల్లో మొక్కలు నాటి పచ్చదనం పరిశుభ్రతను పాటించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ రాజర్షి షా పలు కార్యక్రమాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో ప్రతి రోజూ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. గ్రామాల్లో పచ్చదనంతో పాటు పరిశుభ్రత కార్యక్రమాలు చేయాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జైనథ్, ఆగస్టు 2: ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామ స్థాయి ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యూత్ సభ్యులు, వార్డు సభ్యులు ర్యాలీ తీయాలన్నారు. పండుగ వాతావరణంలా పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణంపై చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో వెంకట్‌రాజ్, ఏపీవో వివేక్, మండల వైద్యాధికారి నయనత, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ, ఆగస్టు 2 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చోడ, సిరికొండ మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇచ్చోడ ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో రమేశ్, ఏపీవో నరేందర్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు

మోడీ, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

బోథ్, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సొనాలలో ప్రధాని నరేంద్ర మోడీ, మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడల స్వామి, బీజేపీ నాయకులు, ఎమ్మార్పీ ఎస్ జిల్లా నాయకులు శంకర్, అశోక్, మనల శేఖర్, దినేష్, సంతోష్, లంక లలిత, కిష్టయ్య, రాజు, సుభాష్, సూర్య, హరీష్, రంజిత్, రాజేశ్వర్, మురళి, విష్ణు, కసిరే పోతన్న, బాశెట్టి రమేశ్, సదానందం, గంగాధర్, రోహిదాస్, సుండల్ సింగ్, రవికాంత్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్, ఆగస్టు 2 : మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రామాంచాల లక్ష్మన్, దోమకొండ సుధాకర్‌లు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రేమ్ రాజ్, నక్క భూమన్న, కనకయ్య, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన

బోథ్, ఆగస్టు 2 : సొనాలలోని ఉషోదయ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ బాశెట్టి అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ విధానం ద్వారా మనిషిని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇర్ల గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్ టౌన్ సీఐగా సునీల్ కుమార్

ఎదులాపురం, ఆగస్టు 2 : ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బొమ్మ గాని సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలి కారు. సిబ్బంది తమను తాము పరిచ యం చేసుకున్నారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సీఐగా పని

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

ఎదులాపురం, ఆగస్టు 2 : సాధారణ బదిలీలో భాగంగా నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చి టూ టౌన్ ఎస్సై కాంబ్లే విష్ణు ప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ సిహెచ్ కరుణాకర్ రావ్‌కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈయన గతంలో టూటౌన్ ఎస్సైగా పని చేశారు.

పిల్లల ఎదుగుదలపై సమీక్ష

నేరడిగొండ, ఆగస్టు 2 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాలులో పిల్లల ఎదుగుదలపై అంగన్‌వాడీ టీచర్లతో ఎంపీడీవో రజ్వీర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బరువు, ఎత్తు తదితర అంశాలపై ఎలాంటి తప్పులు చేయకుండ, అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, ఎంపీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

విహారయాత్రలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు

ఎదులాపురం, ఆగస్టు 2 : రానున్న శ్రావణమాసమును పురస్కరించుకొ ని, వివాహాలు, విహారయాత్రలు, ఇతర శుభ కార్యములకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన ఇవ్వడం జరుగుతుందని ఆర్టీసీ ఆర్ఎం పి. సోలోమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణము నకు ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాలోని అన్ని డిపోల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. ముందస్తుగా బస్సులను బుక్ చేసుకోగలన్నారు. మరిన్ని వివరముల కొరకు మీ సమీప డిపో మేనేజర్లను సంప్రదించగరు. ఆదిలాబాద్ & ఉట్నూర్ 9959226002, నిర్మల్ 9959226003, మంచిర్యాల 9959226004, భైంసా 9959226005, ఆసిఫాబాద్ 9959226006 డిపో మేనేజర్లు పోన్ నంబర్లు సంప్రదించాలన్నారు.

బోథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా విఠల్

బోథ్, ఆగస్టు 2 : బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా విఠల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కార్యదర్శిగా పని చేసిన మనోహర్ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మార్కెట్ కమిటీకి బదిలీపై వెళ్లారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ కార్యదర్శిగా పని చేస్తున్న విఠల్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శిని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జేఎంఎస్ లక్ష్మీ, ముఖిద్, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ సాధ్యం

బోథ్, ఆగస్టు 2 : చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని కేజీబీవీ ప్రిన్సిపల్ వలిత, సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం బోథ్‌లోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆడెపు రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్ ఎంపీడీవోగా జీవన్‌రెడ్డి

బోథ్, ఆగస్టు 2 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జీవన్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను మండల పరిషత్ అధికారులు, సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

కన్న తండ్రినే కడ తేర్చిన కొడుకు

మద్యానికి బానిసై ఇంట్లో గొడవ

కడెం,ఆగస్టు 2 : కొడుకే కన్న తండ్రిని కడ తేర్చిన ఘటన శుక్రవారం నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్న బెల్లాల్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..చిన్న బెల్లాల్ గ్రామానికి కుడిమేత మధు(48) కూలీ పని చేసుకుంటూ మద్యానికి బానిస అయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తరచూ ఇంట్లో పెద్ద కొడుకు అనిల్, భార్య లక్ష్మిని వెళ్ల గొట్టేవాడు. ఇట్టి విషయంలో వారం రోజుల క్రితం కుడిమేత అనిల్ తన తండ్రితో గొడవ పడి దాడి చేశాడు. మళ్లీ గొడవ చేస్తే చంపుతానని బెదిరించాడు. ఐదు రోజుల క్రితం మద్యం తాగేందుకు మళ్లీ డబ్బులు కావాలని కుడిమేత మధు ఇంట్లో గొడవ చేయగా వారిని ఇంటి నుంచి గెటివేసి రావద్దని బెదిరించాడు. దీంతో అనిల్ తన తండ్రిని చంపితే గానీ ఇల్లు దక్కేటట్లు లేదు అని అనుకున్నాడు. శుక్రవారం ఉదయం 10:10 గంటలకు అనిల్ ఇంటికి వెళ్లగా తన తండ్రి మధు అనిల్‌ను ఎందుకు వచ్చావు నీవు ఇంట్లోకి రావడానికి వీలు లేదని గొడవపడ్డాడు. తన తండ్రిని ఏలాగైన చంపాలని ఉద్దేశ్యంతో తన వెంట తెచ్చుకున్న కర్రతో తండ్రి తల, ఎడుమ కన్ను భాగంలో బలంగా కొట్టడంతో తీవ్ర గాయమై, ఇంటి ముందున్న సీసీ రోడ్డుపై పడిపోయి మృతి చెందాడు. మృతుడి తల్లి కుడిమేత గంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డి తెలిపారు. కాగా ఘటన స్థలాన్ని ఖానాపూర్ సీఐ ఇన్‌చార్జి (సోన్ సీఐ) కే నవీన్ కుమార్ పరిశీలించారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు మద్దతు

బోథ్, ఆగస్టు 2 : సొనాలోని పార్డి(బీ) రాయిసెంటర్‌లో పెద్దలు శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ తెలంగాణ, ఆంధ్రరాష్ట్రంలో ఉన్న వలస లంబాడీలను తొలగించి ఎస్టీలను వర్గీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సార్‌మేడి లక్ష్మణ్, గీతాధార్ ఆత్రం గ